ముఖ్యమంత్రికి ఉద్యోగ సంఘాల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉద్యోగుల బకాయిలు చెల్లించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకుఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఎన్‌జిఒ హోంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1,100 వందల కోట్లు జనవరిలో చెల్లించారని పేర్కొన్నారు. నేటి నుంచి సుమారు రూ.6,200 కోట్ల బకాయిలు జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తున్నారని తెలిపారు. ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. విద్యాసాగర్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు దాదాపు రూ.25 వేల కోట్లు బకాయలు ఉండడంతో, కూటమి ప్రభుత్వం దశలవారిగా చెల్లిస్తూ ఉందని చెప్పారు. ఉద్యోగులకు ఐఆర్ 29 శాతం, డిఎ బకాయులు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం ప్రజా చైతన్య యాత్రకు సమస్యల వెల్లువ

తొలిరోజు మృత్యుంజయకుంట, వైఎస్ నగర్‌లో నాయకుల పర్యటన సమస్యలు వింటూ...అధికారుల దృష్టికి తీసుకెళ్తూ...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్

కడప కార్పొరేషన్ పరిధిలోని మృత్యుంజయకుంట, వైఎస్‌నగర్ ప్రాంతాల్లో సిపిఎం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించింది. తొలిరోజు యాత్రలో భాగంగా మృత్యుంజయకుంట, వైఎస్‌నగర్ ప్రాంతాల్లోని గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంది. యాత్రకు సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కామనూరు శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, జమీల, కుమారస్వామిరెడ్డి, రవి, శివరాం, విజయ్, నరసింహ, ఎం.వెంకటేశ్వర్లు, స్టీఫెన్, శంషాద్, సరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ మాట్లాడుతూ నగరం నడిబొడ్డున ఉన్న మృత్యుంజయకుంట అభివద్ధిని పాలకులు విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఇంటి పన్ను, ఆస్తి పన్ను, నీటి పన్ను అన్ని రకాల పనులు కార్పొరేషన్ కడుతున్నారని అయినా పాలక వర్గాలు విస్మరించడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు ఈ ప్రాంతాన్ని సమగ్ర అభివద్ధి చేస్తామని హామీ ఇచ్చిన ప్రజా ప్రతినిధులు ఈరోజు అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన సమస్యలపై రానున్న కాలంలో కడప కార్పొరేషన్ ఎదుట దశల వారి పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సిపిఎం ప్రతినిధి బృందానికి పలువురు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. వీటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారానికి పాటుపడుతూ ప్రజా చైతన్య యాత్ర సాగుతోంది.

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

మురుగుకుంటను పరిశీలిస్తున్న నాయకులు

రోడ్డు, డ్రెయినేజీ సదుపాయాన్ని కల్పించాలి

లోతట్టు ప్రాంతమైన మృత్యుంజయకుంటలో పేదలు, నిరు పేదలు నివాసం ఉంటున్న కారణంగా దశా బ్దాల తరబడి రోడ్లు, డ్రెయినేజీ సదుపాయాలకు నోచు కోలేదు. ప్రతిఏటా వర్షాకాలంలో మృత్యుంజయకుంటను వరద, మురుగు నీరు ముంచెత్తడం పరిపాటిగా మారింది. వారాల తరబడి ముంపు వీడని పరిస్థితి కారణంగా జ్వరాల బెడద అధికంగా ఉంటోంది.

- దాతు పార్వతమ్మ, మృత్యుంజయకుంట.

వికలత్వ పింఛను అందించి ఆదుకోండి

తనకు వికలత్వపింఛను రావడం లేదు. వైద్యులు నిర్ధారించే పరీక్షల్లో శాతం లేదనే సాకుతో నిరాకరిస్తున్నారు. పలుమార్లు బెంగళూరు, విశాఖపట్నం వంటి మానసిక ఆస్పత్రులకు వెళ్లి చికిత్స తీసుకుంటున్నా. మానసిక ఆసుపత్రులకు వెళ్లడానికి వేలాది రూపాయలు ఖర్చు అవుతోంది. భరించేంతటి ఆర్థికస్తోమత లేక ఇబ్బందులు పడుతున్నాను.

- వల్లూరు కమాల్, మృత్యుంజయకుంట.

లింకు రోడ్డు సదుపాయాన్ని కల్పించండి

మృత్యుంజయకుంట లోతట్టు ప్రాంతం నుంచి అవతలి వీధికి ఉన్న రోడ్డును కలిపితే ఆర్టీసీ బస్టాండు వరకు రహదారి అందుబాటులోకి వస్తుంది. ఆర్ఐ, తహశీల్దార్లు వచ్చి లింకురోడ్డును తొలగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మీరైనా అధికారులతో మాట్లాడి రోడ్డు సదుపాయాన్ని కల్పించాలి. వర్షాకాలంలో వరద, మురుగు నీళ్ల మధ్యలోనే వారాల తరబడి తమ జీవితాలను గడపాల్సి వస్తోంది.

- బత్తల ప్రశాంతి, మృత్యుంజయకుంట.

వితంతు పింఛన్ లేక ఇబ్బందులు

తన భర్త చనిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. వితంతు పింఛన్ దరఖాస్తు చేసుకున్నా లభించడం లేదు. ఐదు రోజులుగా మంచినీళ్లు సరఫరా కావడం లేదు. సిమెంటు రోడ్డు, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, ఎండియు వెహికల్ రాకపోవడంతో కిలోమీటర్ల తరబడి రేషన్ సరుకులకు పరుగులు తీయాల్సి వస్తోంది. దశాబ్దాల తరబడి కార్పొరేటర్, సంబంధిత కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసు కెళ్తున్నప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు.

- షాయినా, మృత్యుంజకుంట.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో కడప ఉక్కును సాధిద్దాం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే అమరులైన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల త్యాగాల స్ఫూర్తితో కడప ఉక్కును సాధిద్దామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాలశివకుమార్ పిలుపునిచ్చారు. కడపలో ప్రభుత్వం అధికారులు భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడపలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి ఉరికొయ్యను ముద్దాడినటువంటి మహనీయులు ప్రాణస్నేహితులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లని కొనియాడారు. వారి ప్రాణ త్యాగాలను కేంద్ర ప్రభుత్వం గౌరవించడం లేదన్నారు. అధికారికంగా ఎక్కడా వారి జయంతులు, వర్ధంతులు నిర్వహించడం లేదన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం అమలు చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. కడప ఉక్కును విస్మరించి ఇక్కడి ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బతీసిందన్నారు. ఇక్కడి వలసలు, కరువులు పాలకులకు కనిపించడం లేదన్నారు. యువత ఉద్యోగాలు ఉపాధి లభించక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. కడపలో యువతకు ఆదర్శమూర్తి అయిన భగత్ సింగ్ విగ్రహం ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన స్ఫూర్తితో కడప ఉక్కు కోసం పోరాడదామని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు వెంకటేష్, అల్లాబకష్, వంశీ పాల్గొన్నారు. **బద్వేలు :** 23 సంవత్సరాల వయసులో దేశ స్వాతంత్రం కోసం చిరునవ్వుతో ఉరికొయ్యలను ముద్దాడిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లను నేటి యువతీ యువకులు వారి స్ఫూర్తిని వారి ఆశయాలు ముందు తీసుకోవాలని డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పిలుపునిచ్చారు. శనివారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 94వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర సాధనకై బ్రిటిష్ దొరలకు వ్యతిరేకంగా నూనూగు మీసాల యువకుడు భగత్ సింగ్ 'నా దేహం ముక్కలైనా.. నా దేశాన్ని కాపాడుకుంటాం' అని నినదిస్తూ పార్లమెంట్‌లో బాంబులు వేసి బ్రిటిష్ దొరలకు వ్యతిరేకంగా కరపత్రాలు విడుదల చేశారాన్నరు. దీంతో బ్రిటిష్ దొరలు అనేక నిర్బంధాలను హింసాత్మక ఘటనలను, అక్రమ కేసులు బనాయించినా లెక్క చేయలేదని పేర్కొన్నారు. భారతమాత ముద్దుబిడ్డ భగత్ సింగ్ ఆశయాలను ఆలోచనలను ముందుకు తీసుకు పోవాల్సిన బాధ్యత యువకులపై ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్ కే ఆదిల్, బద్వేల్ రూరల్ కార్యదర్శి యు బాల గురయ్యా, పట్టణ ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా చిన్నపరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్ : భారతీయ జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యునిగా కడప ఇంటాక్ చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఎన్నికయ్యారు. ఈనెల 21న న్యూఢిల్లీలోని లోది ఎస్టేట్‌లో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఇందులో చిన్నపరెడ్డికి మంచి మెజార్టీ లభించడంతో ఆయనను ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఇదే ఎన్నికల్లో ఇంటాక్‌కు జాతీయ ఛైర్మన్‌గా కడప చాప్టర్ బలపరిచిన మహారాష్ట్ర నాగపూర్‌కు చెందిన అశోక్‌సింగ్ ఠాకూర్ ఇంటాక్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ రెండు పదవులకు నూతన అభ్యర్థులు ఎంపిక కావడం ఇదే ప్రథమం. విభజన అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి జాతీయ గవర్నింగ్ కౌన్సిల్‌కు తెలుగు వ్యక్తి సభ్యుడిగా ఎన్నిక కావడం కూడా ఇదే తొలిసారి కావడం విశేషం.

గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప - రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు రెండు సంవత్సరాల కిందటే కేంద్ర మంత్రి ప్రారంబించినప్పటికీ ఇంతవరకు కొన్ని ప్రాంతాలలో అటవీ శాఖ అనుమతులు లేక ఆగిపోయిందని, త్వరితగతిన పనులు ప్రారంభించి రోడ్డు పూర్తి చేయాలని ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల శాసనమండలిలో జిల్లా సమస్యలపై ఆయన ప్రస్తావించారు. సిపి బ్రౌన్ లైబ్రరీకి గత ప్రభుత్వం అదనపు గదుల నిర్మాణం కోసం రూ. 6.80 కోట్లు మంజూరు చేసిందని, అధికారులు పనులు ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్టను టూరిజం కేంద్రంగా మార్చి అక్కడ ఉన్న చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. బుగ్గ వంక ఇరువైపులా ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు వేయాల్సి ఉందని, మూడు కిలోమీటర్లు మాత్రమే వేశారని మిగిలిన 5 కిలోమీటర్లు త్వరగా పూర్తి చేయాలని మండలి సభ దృష్టికి తీసుకెళ్లారు. పాపాగ్ని నదిపై నిర్మించిన కొత్త వంతెన కొంత పెండింగ్ ఉందని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లిస్తామన్న కూటమి ప్రభుత్వం, 9 నెలలైనా చెల్లించకపోవడం దారుణమన్నారు. 12వ పిఆర్‌సిపై కమిటీ వేశారని, అది రద్దయిందని, కొత్త కమిటీ వేసి 12వ పిఆర్‌సిని ప్రకటించాలని కోరారు. మరిన్ని సమస్యలపై ప్రస్తావించారు.

ఎంఇఒపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

వెంకటరామిరెడ్డి (ఫైల్‌ఫొటో)

మండలం విద్యాశాఖ అధికారి-1 వెంకటరామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఆర్‌జెడి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. ఇటీవల సోషల్ మీడియాలో ప్రభుత్వం మీద వ్యతిరేకంగా పోస్ట్ చేశారనే కారణంగా విచారణ చేసి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని, వైసిపి ప్రభుత్వంలోనే విద్యకు ప్రాధాన్యత ఇచ్చేవారని ఆయన మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో రావడంతో జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు

ప్రజాశక్తి - కడప : అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా నిర్వ హించిన సాంస్కృతిక కార్యక్రమాలు వెటకరాంగా ఉన్నాయని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్ కుమార్‌రెడ్డి విమర్శించారు. వైసిపి నాయకులు ఎప్పుడు కూడా హుం దాతనంతో వ్యవహరిస్తారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తున్నారని మండి పడ్డారు. శనివారం సాయంత్రం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కేవలం మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డికి వ్యతిరే కంగా, వెటకారంగా నిర్వహించారనేది ప్రజలందరూ చూశారన్నారు. జబర్దస్త్ కార్యక్రమంలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారని అన్నారు. జీవితంలో ఎప్పుడు నవ్వని చంద్రబాబు వెక్కిలి నవ్వులు నవ్వారని ఎద్దేవ చేశారు. కేవలం జగన్ను హేళన చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లుందుని పేర్కొన్నారు. సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్ మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు.

డ్రైవర్ల ఉజ్వల భవిష్యత్తుకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : దేశవ్యాప్తంగా డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఢిల్లీలో సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. శనివారం జంతర్ మంతర్ వద్ద ఏర్పాటుచేసిన నిరసనలో అధ్యక్షులు అన్వర్ బాష మాట్లాడుతూ దేశవ్యాప్తంగా డ్రైవర్లు పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారుల నుంచి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డ్రైవర్లు ఆర్థికంగా, మానసికంగా వేధింపులను భరించాల్సి వస్తుందని చెప్పారు. డ్రైవర్ల ఉజ్వల భవిష్యత్తుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ డ్రైవర్ల కమిషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర స్థాయిలో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ బాష, చంద్రమోహన్ పాల్గొన్నారు.

లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు

- జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప

లైంగిక నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు, తీవ్రమైన లైంగిక వేధింపు కేసుల్లో మరణశిక్ష, జరిమానాలు, జైలు శిక్ష విధిస్తారని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శనివారం కడప పట్టణం చిన్న చౌక్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. వంటగదులను, వసతి గదులను, టాయిలెట్లను, ఫ్యాన్లు, లైట్లు, వారికి అందుకున్న భోజనం సదుపాయాలను పరిశీలించారు. అనంతరం పోక్సో చట్టం మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పోక్సో చట్టం అంటే లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పిస్తుందన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ రక్షణ కల్పిస్తుంది అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ న్యాయమూర్తులు పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి ఎం చంద్రశేఖర్ రెడ్డి, ప్రొద్దుటూరు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె. సురేంద్రనాథ్ రెడ్డి, రైల్వే కోడూరు జూనియర్ సివిల్ జడ్జి పి. తేజ సాయి, ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ గిరిజన బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 'హిట్ అండ్ రన్' కేసులలో పరిహారం, చెల్లింపు మొదలగు అంశాలపై డిస్ట్రిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. తరువాత నిర్వహించిన పారాలీగల్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమంలో వాలంటరీ పాత్ర, డ్రెస్ కోడ్, ప్రవర్తన, నీతి ప్రమాణాలు తదితర వాటిపై వివరించారు.

మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

విశ్వవిద్యాలయం తల్లి లాంటిది : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న విసి శ్రీనివాసరావు

మన తల్లిని మనం ఎంతగా ఇష్టపడతామో మన విశ్వవిద్యాలయాన్ని అంతే స్థాయిలో అభిమానించి ప్రగతి కోసం కృషి చేయాలని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. శనివారం విశ్వవిద్యాలయంలోని తాళ్లపాక అన్నమాచార్య సెనేట్ హాల్లో ఆచార్యులు, సహ, సహాయ ఆచార్యులతో ఆయన సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయ సమగ్ర ప్రగతికి ఆయన రూపొందించిన 8 పారామీటర్స్ అధ్యాపకులకు వివరించారు. విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయిలో నిలబెట్టాల్సింది మనమే అనే విషయం గుర్తుంచుకోవాలని కోరారు. విద్యార్థులను నైపుణ్యత గలవారీగా తయారు చేయాలన్నారు. జాతీయ విద్యా విధానం - 2020 అనుసరించి మనం సమర్థవంతంగా పని చేయాలన్నారు. విశ్వవిద్యాలయం వృక్షం లాంటిదని దానిని కాపాడుకున్నంత కాలం తర్వాత తరతరాలకు ఫలాలను ఇస్తుందన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా అంతా ఒకటిగా పని చేద్దామని కోరారు. విద్యాలయాల మధ్య విపరీతమైన పోటీని ఎదుర్కోబోతున్నామని, నిరంతరం శ్రమించకపోతే చాలా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. జాతీయస్థాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్‌లో సుస్థిరమైన చోటు దక్కించుకోవాలంటే ఎక్స్ టెన్సివ్ యాక్టివిటీస్ నిర్వహించాల్సి ఉందన్నారు. అ దిశగా మనమంతా ముందు కదలాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ ఎస్.రఘునాథ్‌రెడ్డి, ఆచార్యులు, సహ, సహాయ ఆచార్యులు పాల్గొన్నారు.

జలదినోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

భూగర్భ జలాలను పెంచాలి

- ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

ప్రజాశక్తి - కడప

నీటిని పొదుపుగా వాడుతూ వర్షపు నీటిని ఇంకుడు గుంతల సాయంతో ఒడిసి పట్టుకొని భూగర్భ జలాల స్థాయి పెంచాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. శనివారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, జియాలజీ విభాగం సంయుక్తంగా కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో అందరికీ సురక్షితమైన తాగునీరు అందించడం ఒక ముఖ్యమైన అంశమని తెలిపారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. కరీముల్లాబాష మాట్లాడుతూ నీటి సంరక్షణ అవసరం, ఆవశ్యకత, నీటి సంరక్షణ పద్ధతులు మొదలైన అంశాలను విద్యార్థులకు వివరించారు. చాలా ప్రాంతాలలో భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయని, వాటి స్థాయి పెంచుకోకపోతే భవిష్యత్తులో తాగునీటి సమస్యల అధికమవుతాయని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ అందరికీ జీవనాధారమైన నీటిని విచక్షణ రహితంగా ఉపయోగించరాదని, సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివరామకృష్ణ, డాక్టర్ రమేష్ యాదవ్, డాక్టర్ అంకాల నాగరాజు, జియాలజి డిపార్ట్‌మెంట్ డాక్టర్ రామకృష్ణ, మహేష్, ఫిజికల్ డిపార్ట్మెంట్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి హోదా కల్పించడం హర్షణీయం

ప్రజాశక్తి - కడప : బేడ బు డగ జంగాలకు కేబి నెట్‌లో ఎస్‌సి హోదా కల్పించడం హర్ష ణీయమని సంఘం జిల్లా అధ్యక్షులు దూ పంరాజు, డి. శ్రీరాములు పేర్కొ న్నారు. శనివారం కడప నగరం 48వ డివిజన్ బుడగజంగం కాలనీలో వారు కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీకి, సిఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సిఎం పవన్ కల్యా ణ్‌కు, మంత్రులు నారా లోకేష్‌కు, వై.సత్య కుమార్ కు, కడప ఎమ్మెల్యే మాధవికి కృజ్ఞతలు తెలియజేశారు. బేడబుడగ జంగాలకు ఎస్‌సి హోదా కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయ కులు ఎం.ఎస్. రాజు, బేడ బుడగజంగం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.కొండయ్య స్థానిక కుల పెద్దలు విద్యార్థులు మహిళలు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - కడప : బెట్టింగ్ యాప్స్ పట్ల యువత విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి అన్నారు. శనివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'బెట్టింగ్ యాప్స్ అప్రమత్తత' పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మొదట లాభా లు చూపించి, చివరికి దోచుకుంటారని చెప్పారు. ఆనందంగా మొదలైన ఆట అలవాటుగా మారుతుందని చెప్పారు. పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, గౌస్ పీర్ సేన అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ రూపొందించారు. కార్యక్ర మంలో పిసిసి నరల్ సెక్రటరీ పీ.అలిఖాన్, పిసిసి డెలిగేట్ పొట్టిపాటి చంద్రశే ఖర్‌రెడ్డి, క్రైస్తవ మైనారిటీ జిల్లా అధ్యక్షులు, పి.డి. సంజయ్ కాంత్, అబ్దుల్ సత్తార్, హరి ప్రసాద్, రఫిక్ ఖాన్, సుబ్రహ్మణ్యం శర్మ, కదిరి ప్రసాద్ గౌడ్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

ఎస్‌పి అశోక్ కుమార్ ఉత్తర్వుల మేరకు నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి వాహనాలు తనిఖీ చేశారు. శనివారం వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. త్రిబుల్ రైడింగ్ చేయవద్దని తెలిపారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని, పరిమితికి మించిన వేగంతో వెళ్లవద్దని చెప్పారు.

దళితుల హక్కుల కోసం ఉద్యమించాలి

- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప పిలుపు

ప్రజాశక్తి- కడప అర్బన్

దళితుల హక్కుకై ఉద్యమించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప పిలుపునిచ్చారు శనివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా విస్తృత సమావేశం కడప ఆర్కే నగం లో నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. దళితుల ఓట్లు కావాలి, కానీ దళితుల హక్కులు మాత్రం కాలరాస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. హత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్నటువంటి దళిత వర్గం ఏకమై ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. సమావేశంలో జకరయ్య, మనోహర్, జితేంద్ర, అన్వేష్, రామ్మోహన్, దస్తగిరి రెడ్డి, రఘు, నాగేంద్ర, జార్జి, బాబు, డేవిడ్, నరసయ్య, రవి, వెంకటేశు, రాయప్ప నరసింహ, మహేష్, జయరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప

వైఫల్యం

ప్రజాదృష్టి

జిల్లాలో వ్యవస్థల వైఫల్యం కొనసాగుతోంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికపై ఆసీనులైన జాయింట్ కలెక్టర్ అతిది సింగ్ ఎదుట తమకు న్యాయం చేయాలని కోరుతూ ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని నిరసన తెలపడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యను నెల రోజుల వ్యవధిలో పరిష్కరించాల్సి ఉంది. ఐదు నెలల వ్యవధిలో 11 సార్లు ప్రజాసమస్యల పరిష్కారవేదిక దృష్టికి వచ్చినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. చాపాడు మండలానికి చెందిన ఓ మహిళ కుటుంబ నియంత్రన ఆపరేషన్ నిమిత్తం ప్రొద్దుటూరులోని ప్రభుత్వాస్పత్రిని సంప్రదించారు. అక్కడి ప్రభుత్వ వైద్యులు కు.ని ఆపరేషన్ చేయడానికి తన భర్త స్కానింగ్ సెంటర్‌కు పంపించి స్కానింగ్ రిపోర్టును తెప్పించుకుని పరిశీలించింది. స్కానింగ్ రిపోర్టు ఆధారంగా కు.ని ఆపరేషన్ నిర్వహించింది. పేగుకు ఏర్పడిన రంధ్రాన్ని గమనించకుండా కు.ని ఆపరేషన్ పూర్తి చేసింది. అనంతరం బాధి తురాలికి కడుపులో ఉబ్బరం నొప్పిగా ఉండడంతో మరోసారి వైద్యురాలిని సంప్రదించింది. మీకు ఎటువంటి సమస్యా లేదని గ్యాస్ సమస్య కారణంగా వస్తోందని చెబుతూ మందుల పేరుతో కాలయాపన చేసింది. నొప్పిని భరించలేని మహిళ, తన భర్తతో కలిసి హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రిని సంప్రదించింది. అక్కడి వైద్యులు పేగుకు రంధ్రం ఏర్పడిందని, ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. బాధిత కుటుంబం అవాక్కైంది. కు.ని ఆపరేషన్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన వైద్యురాలిని విధుల నుంచి తొలగించాలని, తాము బాధ పడినట్లు మరొకరు బాధపడ కూడదని బాధిత కుటుంబం పట్టుబట్టింది. పలుమార్లు డిఎంహెచ్ఒ, ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయించింది. డిఎంహెచ్ఒ అందించిన నివేదికలో వైద్యురాలిని తప్పుబడుతూనే పార్షియల్ పదాన్ని ఉపయోగించడంపై బాధిత కుటుంబం భగ్గుమంది. పక్షపాతంతో కూడిన నివేదికను అందించిన డిఎంహెచ్ఒపై విచారణకు ఆదేశించాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక పైకి చేరుకుని జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. జెసి డిఎంహెచ్ఒ నివేదిక వరకు పరిమితం కావడంతో తీవ్ర ఆసహనానికి గురైన సదరు యువకుడు పెట్రోల్ పోసుకుని నిరసన తెలపాల్సిన దుస్థితి వచ్చింది. దీనిపై జాయింట్ కలెక్టర్ మరోసారి విచారణకు ఆదేశించి నివేదిక తెప్పించుకుని తదుపరి చర్యలు తీసుకుని ఉండాల్సి ఉంది. అటువంటి ప్రయత్నం చేయకపోవడం బాధాకరం. మనుషుల ప్రాణాలతో చెలగాటమాడడం ప్రమాదకరమనే సంగతిని గ్రహించాలి. ఇటువంటి తరహా ఘటన ప్రయివేటు రంగంలో మరొకటి చోటు చేసుకుంది. కడప నగరానికి చెందిన ఓ ప్రముఖ వైద్యుని ఆస్పత్రికి అధికార పార్టీకి చెందిన ఓనాయకుడు కడుపు నొప్పి, కిడ్నీలో రాళ్లు తదితర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి చేరుకున్నారు. స్కానింగ్ రిపోర్టును కూలకషంగా పరిశీలన చేయకుండా ఆపరేషన్ చేయడంతో పరిస్థితి విషమించినట్లు సమాచారం. సదరు వైద్యులు సొంత నిధులతో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలిం చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఏదేమైనా మనుషుల ప్రాణాలతో వ్యవస్థల చెలగాటం కారణంగా మనుషులు ప్రాణాలు సైతం గాలిలో దీపంలా మారిన పరిస్థితులను సరిదిద్దాల్సిన జిల్లా స్థాయి సర్వోన్నతాధికారులు వివాదాస్పద నివేదికలకు పరిమితమై, బాధితుల గోడను గాలికి వదిలేయడం క్షంతవ్యం కాదనే సంగతిని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సమస్యలపై చర్చిస్తున్న అధికారులు, టిడిపి నాయకులు

డిమాండ్ల పట్ల సానుకూలంగా ఉన్నాం

- టిడిపి నేతలతో ఎస్ఎంఎస్ కంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి - వేముల

టిడిపి నాయకులు డిమాండ్ల పట్ల తాము సానుకూలంగా ఉన్నామని తుమ్మలపల్లి యుసిఐఎల్ కర్మాగారంలోని ప్రధాన కాంట్రాక్ట్ ఎస్ఎంఎస్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మబ్బుచింతలపల్లెలో టిడిని నాయకుడు, ట్రేడ్ యూనియన్ నేత శ్రీనాథ్‌రెడ్డి నివాసంలో శనివారం అధికారులు పేర్ల పార్థసారధిరెడ్డితో సమావేశమయ్యారు. ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన గ్రూప్ హెడ్ హెచ్ఆర్ నిషికాంత్ జి బోరే, ఎజిఎం హెచ్ఆర్ నరేష్ నాగపురే నాయకులతో మాట్లాడారు. అధికారులు మాట్లాడుతూ ఎస్ఎంఎస్ కంపెనీలోకి టిడిపి నేతల సిఫార్సులను అనుమతిస్తామన్నారు. ఉద్యోగాలు కల్పించడానికి చొరవ చూపుతామని, అన్యాయంగా తొలగించిన నలుగురు కార్మిక నాయకులను యాజమాన్యంతో సంప్రదించి వారిని వీలైనంత తొందర్లోనే విధుల్లోకి తీసుకునేలా చేస్తామన్నారు. పులివెందులలోని టిడిపి నేతలు యురేనియం పరిశ్రమ వద్ద చేయాలనుకుంటున్న సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నామని నాయకులు తెలిపారు.

బండ లాగుతున్న ఎడ్లు

ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి తిరుణాల

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొమ్మలూరు గ్రామంలో శ్రీశ్రీరామలింగ చౌడేశ్వరి అమ్మవారి తిరుణాల శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు ఆలయ కమిటీ బహుమతులను అందజేసింది. బీచువారిపల్లె కోలాట బృందం అలరించారు. అమ్మవారి గ్రామోత్సవం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లి దేవరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరులోని పెద్దమ్మతల్లి దేవరను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులుగా పెద్దమ్మతల్లి ఆవరణలో చల్ల పోస్తున్నారు. పెద్దమ్మ గుడి దగ్గర నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. పెద్దమ్మతల్లి ఆవరణ ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

పెద్దమ్మ తల్లి ఆవరణలో చల్ల పోస్తున్న నిర్వాహకులు

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక శిల్పారామంలో నృత్య ప్రదర్శలు ఏర్పాటు చేశామని పరిపాలనాధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఆర్ మానస వారి శిష్య బృందంచే ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

ఉంగరంతో ఉడాయించిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ వెనుక వైపున ఒక వీధిలో మహబూబ్ బి అనే వృద్ధురాలిని మోసగించి ఉంగరంతో ఉడాయించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం సిఐ నరేష్‌బాబు మాట్లాడుతూ.. ఈనెల 9న ఖాజీపేటకు చెందిన కొత్తపల్లి ఖాసీంపీరా అనే వ్యక్తి తన కూతురి పెళ్లికి పిలిచేందుకు వచ్చానని మహబూబ్ బితో నమ్మబలికాడు. తన చేతికి ఉన్న ఉంగరాన్ని ఒకసారి చూపించాలని, మోడల్ బాగుందని, ఇలాంటిదే చేయిస్తానని వృద్ధురాలి వద్ద నుంచి ఇప్పించుకున్నాడు. ఉంగరం తీసుకొని ఇంటి బయట ఆటోలో తమ వాళ్లు ఉన్నారని చూపించి వస్తానని తీసుకువెళ్లాడు. అటు నుంచి అటే పరారయ్యాడు. మహబూబ్ బి ఫిర్యాదు మేరకు కేసు విచారించామన్నారు. నిందితుడ్ని ప్రొద్దుటూరు రోడ్డులో పాత ఎస్‌బిఐ వద్ద శనివారం అరెస్టు చేశామన్నారు. ఉంగరాన్ని రికవరీ చేశామని చూపించారు. చెడు వ్యసనాలకు బానిసై ఇతను గతంలో కూడా దొంగతనాలకు పాల్పడ్డాడని సిఐ తెలిపారు. పలు పోలీస్‌స్టేషన్లలో ఖాసీంపీరాపై కేసులు ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిఐ

తాళం బయటకు కనపడకుండా డిజిటల్ లాక్, స్మార్ట్ లాక్ వంటివి వాకిలికి బిగించుకోవాలని సిఐ నరేష్‌బాబు పేర్కొన్నారు. బైకు దొంగతనాలు ఎక్కువయ్యాయని, బైక్, టైరుకు లాక్ వేసుకోవాలని సూచించారు. వీధుల్లో అవకాశం ఉన్నవారు చిన్నపాటి సిసి కెమెరాలు బిగించుకోవాలని సూచించారు. ముఖానికి గుడ్డ పెట్టుకుని కొత్త వ్యక్తులు సంచరిస్తూ ఉంటే వారి వివరాలు సేకరించాలన్నారు. అనుమానం వస్తే పోలీసులకు తెలపాలన్నారు. మోసాలు, దొంగతనాలకు అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల ఎటిఎం దొంగతనానికి ప్రయత్నించిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచమన్నారు. కోర్టు వారికి రిమాండ్ విధించిందన్నారు. సమావేశంలో పోలీసులు పాల్గొన్నారు.

అరెస్టు చూపుతున్న పోలీసులు

వేంపల్లెలో పడకేసిన పారిశుద్ధ్యం

ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు నీరు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మేజర్ పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. ఆయా ప్రాంతాల్లో వీధులన్నీ అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. దోమలు విపరీతంగా పెరిగి వ్యాధులు వ్యాప్తిస్తున్నాయి. డ్రయినేజీ కాలువల్లో ఉన్న చెత్తను తొలగించికపోవడంతో కాలువల్లోని మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. పాదచారులకు ఇబ్బందిగా మారింది. కొన్ని చోట్ల మురుగు కాలువల్లో పూడిక తీసినా, దాన్ని అక్కడే వదిలేశారు. అది మళ్లీ కాలువల్లో పడి, దుర్వాసనను వెదజల్లుతోంది. ఇళ్ల మధ్య మురుగునీరు నిలుస్తుండడంతో దోమలు పెరిగిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కొన్ని చోట్ల మురుగునీరు వెళ్లేందుకు వీల్లేక స్థంభించి, దుర్వాసనను వెదజల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త, మురుగు, దోమలకు నిలయాలుగా మారడంతో ప్రజలు సతమతం అవుతున్నారు. పారిశుధ్యంపై ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తున్నా.. ఆ వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ప్రజలకు శాపంగా మారింది. ప్రతి నెల మూడవ శనివారం గ్రామాల్లో తప్పనిసరిగా పారిశుధ్య పనులు చేపట్టాల్సి ఉంది. అధికారులు నామమాత్రంగా పారిశుధ్య పనులు చేయించి ఫొటోలు తీసుకొంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు పెరిగి విషపురుగులకు నిలయాలుగా మారి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఆయా ప్రాంత ప్రజలు నడవడానికి కూడా వీలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు కనీసం బ్లీచింగ్ చల్లిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. అధికారులు తక్షణమే పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్త చెదారంతో నిండిపోయిన కాలువలు

కౌన్సిల్ సమావేశం రసాభాస

కౌన్సిలర్ అలీకి సర్దిచెబుతున్న చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన కమిషనర్ శేషఫణి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంలో 26 అజెండా అంశాలకు సంబంధించి బిల్లుల ఆమోదానికి ప్రతిపాదించారు. అజెండాలో అంశాలు తమకు తెలియకుండా పొందుపరిచి వారికి వారే ఆమోదం చేసుకుంటున్నారని, ఇక సమావేశం నిర్వహించడం ఎందుకని కౌన్సిలర్ అలీ, నాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనవసంర పనులకు కూడా రూ.లక్షలు అజెండాలో ఆమోదం చేసుకుంటున్నారని అలీ అన్నారు. రూ.1600 విలువైన రెండు వీధిలైట్లు రాణివనంలో వేయించాలని పలుమార్లు కమిషనర్‌ను కోరినా పట్టించుకోలేదన్నారు. ప్రజలతో కఠినంగా పన్నులు వసూలు చేస్తున్నారని, ఇక్కడ చూస్తే దుబారాగా ఖర్చు పెడుతున్నారని ఆరోపించారు. విద్యుత్ తీగలు కిందకి ఉండడం వల్ల పలువురు మృతి చెందారని, సమస్యను కమిషనర్‌కు తెలిపితే తమకు సంబంధం లేదన్నారని కౌన్సిలర్ నాగిరెడ్డి అన్నారు. కౌన్సిలర్ ఎరికలరెడ్డి మాట్లాడుతూ లే అవుట్లలో ఇల్లు నిర్మించుకున్న వారికి వసతులు లేవని సభ దృష్టికి తెచ్చారు. పలు చిన్నచిన్న సమస్యలపై అనేకమార్లు అర్జీ ద్వారా కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు దాసరి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మూడు నెలలకు ఓమారు బిల్లులు ఆమోదం చేసుకునేందుకు మాత్రమే సమావేశాలు పెడుతున్నారని తెలిపారు. అనంతరం చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కమిషనర్ శేషఫణి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికే తాము ఉన్నామని అన్నారు. కౌన్సిలర్లు ఎప్పుడు కావాలన్నా తమను అడిగితే పనుల గురించి వివరిస్తానని తెలిపారు. తమకు ఏ మాత్రం విలువ ఇవ్వడం లేదని సమావేశం మధ్యలో నుంచి కౌన్సిలర్లు ఎరుకల రెడ్డి, అలీ వెళ్లిపోయారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వర్రా చంద్రకళ, కౌన్సిలర్లు పెన్నా రసీదు, లావణ్య, లక్ష్మీదేవి, జంషాద్, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

సమావేశం జరగలేదని వైసిపి కౌన్సిలర్ల నిరసన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మున్సిపల్ అధికారుల తీరుకు వైసిపి కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఆ మేరకు మున్సిపల్ కౌన్సిల్ పరిధిలోని 41 మంది కౌన్సిలర్లకు గాను వైసిపికి చెందిన 21 మంది కౌన్సిలర్లు హాజరైనప్పటికీ మున్సిపల్ కమిషనర్‌తోపాటు మున్సిపల్ అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశం నిర్వహించలేదు. హాజరైన మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అధికారుల తీరుకు నిరసన వ్యక్తం చేసి బైఠాయించారు. మధ్యాహ్నం అవుతున్నా అధికారులు రాకపోవడంతో అక్కడే భోజనం చేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు.

భోజనం చేస్తూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

మాట్లాడుతున్న డ్వామా పీడీ అదిశేషారెడ్డి

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు : డ్వామా పీడీ

ప్రజాశక్తి - లింగాల

నాణ్యత లేకుండా వేసిన సిమెంటు రోడ్లు వేసి బిల్లులు మంజూరు చేసుకున్నారు.. మరికొన్ని పనులలో అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీలో రూ.1 లక్ష 36వేలు గుర్తించామని డ్వామా పీడీ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.43,164 రికవరీ చేయనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని 19 పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామజిక తనిఖీ అడిట్‌లో బయట పడిన అక్రమాలపై ఆయన సుధీర్ఘంగా చర్చించారు. పంచాయతీల వారీగా 1,326 రకాల పనులకు సంబంధించిన రూ.5 కోట్ల 35 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. మెటీరియల్‌కు రూ.8,65,54,568 ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో చేపట్టిన పనుల్లో జరిగిన అక్రమాల సొమ్మును రికవరీకి చర్యలు తీసుకున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా క్రింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో డివిఒ రామలింగేశ్వరెడ్డి, ఎపిడి సోమశేఖర్ రెడ్డి, ఎపిఒ గంగరాజు, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎంపిపి రమాదేవి పాల్గొన్నారు.

జల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

అంతర్జాతీయ జల దినోత్సవ సందర్భంగా శనివారం మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా ఎపిడి సుబ్బారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నీటిని, సహజ వనరులను పొదుపుగా, విచక్షణగా వాడుకోవడం చాలా అవసరమని తెలిపారు. రాబోయే తరాలకు కాలుష్యం లేని వాతావరణాన్ని సహజ సంపదలను అందించడమే నిజమైన ఆస్తి అని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి మాట్లాడారు. సీనియర్ అధ్యాపకులు రాధారాం, అనురాధ లక్ష్మి సుబ్బ రాయుడు, రామేశ్వర్‌రెడ్డి, అయ్యవారురెడ్డి, నవనీశ్వర్ రెడ్డి, నరసింహారావు, చెన్న రాయుడు, శ్రీనివాసులు, నెహ్రూ యువ కేంద్ర మైదుకూరు శాఖ బాధ్యులు శివశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం వరల్డ్ వాటర్ డే నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఈసీఈ హెచ్‌ఓడి డాక్టర్ శివ మాట్లాడుతూ జీవకోటికి నీరు చాలా అవసరమన్నారు. నీటి విలువ తెలుసుకొని అవసరాన్ని బట్టి వాడుకోవాలన్నారు. సివిల్ హెచ్‌ఒడి చిన్న సురేష్ బాబు మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో ఫ్యాక్టరీలు, అభివృద్ధి పేరిట నీటిని కలుషితం చేస్తున్నామన్నారు. రోల్ ఆఫ్ వాటర్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భవాని, యునస్, లక్ష్మీప్రసన్న మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేశారు. చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కెసి పుల్లయ్య సేవా తత్పరుడు

- ఎమ్మెల్యే నంద్యాల వరదరాలరెడ్డి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : కెసి పుల్లయ్య సేవా తత్పరుడని ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి అన్నారు. శనివారం కొర్రపాడు రోడ్డులోని కెసి పుల్లయ్య ఎస్టేట్స్‌లో కెసి పుల్లయ్య ఫౌండేషన్ అధినేత కెసి పుల్లయ్య 13వ వర్ధంతిని ఫౌండేషన్ చైర్ పర్సన్ కె.కృష్ణవేణమ్మ, కార్యదర్శి కె.అనిల్ కుమార్ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని కెసి పుల్లయ్యతో తనకున్న అను బంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కెసి పుల్లయ్య ఫౌండేషన్ తరపున పలువురికి అవార్డులు అందజేశారు. 400 మంది పేద విద్యా ర్థులకు సహకారం అందించారు. తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కల్వ సుజాత, ప్రణవ గ్రూప్ అధినేత బూరుగు రవికుమార్, మాజీ టిటిడి బోర్డు మెం బరు టంగుటూరు మారుతీ ప్రసాద్, ఫౌండేషన్ సిఇఒ సుధా, కెసి పుల్లయ్య కుమారుడు సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలి

చాపాడు : ఎండియు ఆప రేటర్లు వాహనాల ద్వారా ప్రతి ఇంటికి రేషన్ బియ్యాన్ని పం పిణీ చేయాలని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. శని వారం స్థానిక కార్యాలయంలో మండల పరిధిలోని రేషన్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో రేషన్ షాపుల వద్ద పంపిణీ జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎండియు ఆపరేటర్లు రేషన్ డీలర్ల ద్వారా వాహనాలలో తమకు కేటాయించిన స్థానాల్లో పంపిణీ చేప ట్టాలన్నారు. రేషన్ డీలర్లు, విఆర్ఒ సంయుక్తంగా ఇకెవైసి త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిటి కృష్ణారెడ్డి, ఆర్ఐ శివశంకర్ రెడ్డి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ట్రిపుల్ఐటి విద్యార్థులు

పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వేంపల్లె : వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ రాష్ట్రస్థాయి పోటీలకు ట్రిపుల్ఐటి విద్యార్థులు ఎంపికైనట్లు ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా పేర్కొన్నారు. జిల్లా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో కేఎస్ఆర్ఎం కళాశాలలో విక్సిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 రీజనల్ స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీలకు కడప, అన్నమయ్య జిల్లాల నుండి దాదాపు 200 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న దస్తగిరి బాషా, కంభగిరి స్వామి, హేమంత్ కృష్ణ, వెంకట సాయినాథ్‌రెడ్డి అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులకు ఫోన్ ద్వారా డైరెక్టర్ అభినందనలు తెలిపారు. శనివారం విద్యార్థులను పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ అభినందించారు. జాతీయ సామజిక సేవ 6వ సంఘం అధికారి డాక్టర్ కోనప్ప, సహాయ ఆచార్యులు డాక్టర్ కల్యాణ చక్రవర్తి పర్యవేక్షణలో విద్యార్థులు రాణించారని చెప్పారు. విద్యార్థులను అభినం దించిన వారిలో అకడమిక్ డీన్ రమేష్ కైలాష్, అధ్యాపకులు ఉన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు : ఎస్ఐ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి సూచించారు. స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో శనివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన రికార్డులు ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపకూడదన్నారు. పరిమితికి వేగంతో వెళ్లాలన్నారు.

IN THE COURT OF THE HON'BLE IIIrd ADDIL JUNIOR CIVIL JUDGE AT KADAPA
O.S. NO. 614 / 2024

Koppolu Hema Prabhavathi .... Plaintiff
V/S
Peddireddy Rahul Reddy, S/o Peddi Reddy

Siva Rami Reddy aged about 33 years, Hindu, resident of Tangedupalli, D.No. 2/33, B. Kodur Mandal, Y.S.R Kadapa dist. ....Defendant

NOTICE TO RESPONDENT

పై దావాలోని Plaintiff ప్రతివాది అయిన నీపై దావా వేసివున్నారు. సదరు దావాలో నోటీసులు నీకు ముట్టనందున కోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలుపమని ఆర్డర్ వేసియున్నారు. కావున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 26-03-2025వ తేదిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు నందు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపవలెను. లేనియెడల నీ పరోక్షమునందు తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
డి.కె. వెంకటరమణ,
అడ్వకేట్, కడప.

బుక్‌లెట్ విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ఆర్‌టిసిని ప్రభుత్వమే నడపాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఎపిఎస్ ఆర్‌టిసిని ప్రభుత్వమే నడపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈనెల 24న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం బుక్‌లెట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిని కాపాడుకోవాలని ప్రజలను, కార్మికులను కోరారు. ఇందుకోసం ఈనెల 24న చలో పార్లమెంటు కార్యక్రమానికి సిఐటియు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపునిచ్చిందన్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగ, కార్మికులు నిరసన తెలిపి ఆర్‌టిసిని కాపాడుకోవాలని కోరారు. ఆర్‌టిసి సంస్థను ప్రయివేట్ కార్పొరేటర్లకు అప్పజెప్పడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలు ఆర్‌టిసికి విస్తరించడం పెను ప్రమాదకరమన్నారు. భవిష్యత్తులో ఆర్‌టిసిని కనుమరుగు చేయాలని కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకారం నాశనం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, శాంతి, సిఐటియు నాయకులు బాబు, డేవిడ్, శీను పాల్గొన్నారు.

పిడుగుపాటుకు చెట్టు దగ్ధం

ప్రజాశక్తి - ముద్దనూరు

ఉరుములు మెరుపులతో శనివారం కురిసిన వర్షానికి చింతకుంట గ్రామంలో పిడుగు పడింది. గ్రామంలోని చిలకల రాజా ఇంటి ముందు ఉన్న టెంకాయ చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు దగ్ధమైంది. చుట్టు పక్కల బయట మనుషులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇంటి సభ్యులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన పోషణ్ భీ.. పఢైభీ శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక స్త్రీశక్తి భవన్ ఐసిడిఎస్ కార్యాలయంలో మూడు రోజులుగా అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న పోషణ్ భీ.. పఢైభీ శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా చాపాడు సెక్టార్ సిడిపిఒ సావిత్రమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు గతంలో అం దించే కార్యక్రమాలతోపాటు మరింత మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం శిక్షణనిచ్చిందన్నారు. నవ చేతన్, ఆధార్ శీలా కార్యక్రమంపై సమగ్ర అవగాహన కల్పించామన్నారు. పిల్లలకు ఏ విధంగా పాఠ్యాంశాలు బోధించాలో ఆటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, సౌజన్య, ప్రత్యుష, శారదమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : తల్లిదండ్రులు పిల్లలను ఎలా పెంచాలా అనేదానిపై సూచనలిచ్చేందుకు అంగన్వాడీ కార్యకర్తలకు సిడిపిఒ శ్రీలత శిక్షణనిచ్చారు. శనివారం స్థానిక రమణమ్మ సత్రం పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ.. పఢాయి భీ శిక్షణలో శిక్షణలో భాగంగా 3వ రోజు నిర్వహించారు. ముఖ్యంగా విభిన్నప్రతిభావంత పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో ఎలాంటి సూచనలు తల్లిదండ్రులకు ఇవ్వాలి, అలాగే వారిని ఎలా గుర్తించాలి అనే అంశంపైన హెచ్ఇ మల్లయ్య వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, ఇది మన అందరి బాధ్యత అని స్థానిక మేజర్ పంచాయతీ సెక్రెటరీ రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక బస్టాండు కూడాలిలో ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివ రించారు. దుకాణ దారులు కూడా ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు పాటుపడాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం వల్ల భూ కాలుష్యం, వాతావరణ కాలుష్యం అధికమవుతుందన్నారు. ఫలితంగా కరువు పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది హేమ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, తక్షణమే అందుకు చర్యలు తీసుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి కోరారు. ఆ మేరకు శనివారం పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త మూలంరెడ్డి ధృవకుమార్‌రెడ్డితో కలిసి ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ హరినాథ్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీ వేంపల్లెలో వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య ఉత్పన్నం కావడం శోచనీయమన్నారు. ఇప్పటికే కొన్ని బోర్లు ఎండిపోయాయన్నారు. పక్కనే పాపాగ్ని నది ఉన్నా.. వేంపల్లె ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాపాగ్ని ఆక్రమణలతో కాలువలా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నదీ గర్భంలో చాలా అడుగుల లోతు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. వెలిగల్లు రిజర్వాయర్ నుంచి దిగువకు నీటిని విడుదల చేసి పాపాగ్ని నదిలో నీటి మట్టం పెంచాలని కోరారు. కార్యక్రమంలో వేంపల్లె, చక్రాయపేట, వేముల కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, వెంకటేష్, రామాంజనేయురెడ్డి, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, కాంగ్రెస్ నేతలు అమ ర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రమణ, నాగరాజు, వినయ్, రవి, బద్రి, వేమారాజా, వేమ య్య, సాయి, విజయ్, చందు పాల్గొన్నారు.

శ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A.NO. 301 / 2021
O.S.NO. 108 / 2014

1. లింగందిన్నె ఓబులరెడ్డి,- died his L.R 2nd Plaintiff
2. లింగందిన్నె ఓబులరెడ్డి, S/o Late L. ఓబుల రెడ్డి, వయసు 33 సం. వ్యవసాయం, R/O. D/O.6/24, కర్చుకుంటపల్లె గ్రామం, ఎర్రగుంట్ల మండలం, కడపజిల్లా.

...పిటిషనర్ / 2వ వాది

Vs

బోగిరెడ్డి లక్ష్మీదేవి, D/O లేట్ బి. ఈశ్వర్ రెడ్డి, వయసు 47సం. వ్యవసాయం, R/O కర్చుకుంటపల్లె గ్రామం, ఎర్రగుంట్ల మండలం, కడపజిల్లా.

....9వ రెస్పాండెంట్

9వ రెస్పాండెంట్ కు నోటీసు

పిటిషనర్/2వ వాది దావా షెడ్యూల్ తెలిపిన ఆస్తిని గురించి డిక్లరేషన్ ఆఫ్‌రైట్ టైటిల్ వగైరా కోరిపై నెంబరు దావాను 1 నుండి 7 ప్రతివాదుల పైన కోర్టులో దాఖలు చేసివున్నాడు. దావా పెండింగ్‌లో ఉండగానే పై నెంబరు దావాలోని 3వ ప్రతివాది గతించినది. 9వ రెస్పాండెంట్ అయిన నీవు 3 వ ప్రతివాదికి వారసురాలివి కనుక నిన్ను దావాలో 9వ ప్రతివాదిగా చేర్చవలెనని కోరుచూ పై నెంబరు పిటిషన్ కోర్టులో దాఖలు చేసిఉన్నాడు. ఈ విషయమై 9వ రెస్పాండెంట్ అయిన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల నీవు పైన తెలిపిన కోర్టు యెదుట 9-4-2025 వ తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలయును లేనంతట నీ పరోక్షముగా తీర్మానించబడును.

(By order of the court)
C. Varadarajulu
Advocate for petitioner
Proddatur.